# ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

**పుట్టపర్తి టౌన్:** సత్యసాయి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆర్‌వీజే ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారాయణ సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రశాంతి గ్రామంలో సత్యసాయి చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని చిత్రావతిరోడ్డు, సమాధి రోడ్డు, ప్రశాంతి నిలయంలో వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాన్నాయి. ప్లానిటోరియం, కల్పవృక్షం, మ్యూజియం, చైతన్యజ్యోతి మ్యూజియం, శివలింగ మందిరం, సత్యసాయి సూపర్ ఆసుపత్రి తదితర ప్రదేశాల్లో జన సందడి కనిపించింది. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా డీఎస్పీ విజయకుమార్, సీఐ సునీత గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పుట్టపర్తి అర్బన్:** రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పెదపల్లి ఉన్నత పాఠశాలలో సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎండీ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నగేష్, డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. దీంతో పాటు దాదాపు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చెన్నకృష్ణారెడ్డి, వెంకటేషులు, రామమూర్తి, నాగభూషణ, సురేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

**ధర్మవరం అర్బన్:** పట్టణంలో శనివారం సత్యసాయి బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సుబ్బదాసు భజన మందిరంలో సేవాదళ్ సభ్యులు సాంబశివుడు, వెంకటేష్, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ, కాకుమాని సాగర్, జనార్దన్ దాదాపు 1400మందికి అన్నదానం చేశారు. ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే లయోలా పాఠశాలలో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తాడిమర్రి:** మండలంలోని పలు గ్రామాల్లో భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాడిమర్రిలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు బూరిశెట్టి శంకర్‌నారాయణ గుప్త, గాదంశెట్టి రమేష్, గంగాధర గుప్త, జీ.కృష్ణమూర్తి, పార్నపల్లి శ్రీనివాసులు సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. బీరబొమ్మ నరేష్, మంగళ చిట్టి, భజన మండలి స్పిర్చువల్ కో ఆర్డినేటర్ బండారు బద్రీనాథ్, బండారు అతుల్య గుప్త తదితరులు పాల్గొన్నారు. స్థానిక సత్యసాయి తాగునీటి సంపు వద్ద కార్మికులు, పిన్నదరి ఎస్సీ కాలనీలో సత్యసాయి బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. పెద్దఓబిలేసు, మహేశ్వర్‌రెడ్డి, చిన్న ఓబిలేసు, తిరుపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**బత్తలపల్లి:** సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని సత్యసాయి వాటర్ ట్యాంకుల వద్ద బాబా చిత్రపటాలకు ప్రజలు పూజలు నిర్వహించారు. మాల్యవంతంలోని భగవాన్ సత్యసాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదానం కార్మికులు నిర్వహించారు.

**తలుపుల :** స్థానిక మూడు రోడ్లకూడలిలో భగవాన్ సత్యసాయి బాబా జయంతి సందర్భంగా శనివారం సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు ఎద్దులరాముడు, చిన్నపరెడ్డి, ఈశ్వరయ్య, సురేంద్ర నాయుడు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ:** మండల కేంద్రంలో సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల సందర్భంగా శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భక్తులు అంబటి చలపతి, కృష్ణవేణి, హరినాథ్, జయశ్రీ, మాధవి, మెడికల్ స్టోర్ యజమాని వాసు, జ్యోతి, హనుమంతు, సూరి, సాయిలీల, భానుశ్రీ, అఖిల పాల్గొన్నారు.


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


తాడిమర్రిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

## సత్యసాయి జయంతి విజయవంతంపై ధన్యవాదాలు

**పుట్టపర్తి టౌన్:** సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలతో పాటు, రాష్ట్ర గవర్నర్ పర్యటన విజయవంతం కావడంతో పోలీస్ యంత్రాంగం, అధికారులు, మీడియా ప్రతినిధులకు ఎస్పీ రత్న ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వారం రోజుల పాటు జరిగిన బాబా జయంతి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.


కేక్ కట్ చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ బృందం


ధర్మవరంలో అన్నదానం చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు


బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి వద్ద అన్నం పొట్లాలను పంపిణీ చేస్తున్న కార్మికులు


సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని ముదిగుబ్బలో అన్నదానం చేస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### పంటలకు మద్దతు ధర కల్పించాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

**కదిరి టౌన్:** అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 26 కార్మిక, రైతు సమస్యలపై పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ వారు పట్టణంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు ఆత్మహత్యల నివారణకు రుణ ఉపశమన చట్టం చేయాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగించడం ఆపాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల కల్పించాలని కోరారు. నాయకులు బడా సుబ్బిరెడ్డి, జీఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తక్, రామ్మోహన్, నారాయణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**కదిరి అర్బన్:** కేఎస్ పాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు శనివారం ఎడీసీసీ బ్యాంక్ మాజీచైర్మన్ లింగాల శివశంకర్ రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ లింగాల మధుసూదన్‌రెడ్డి స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఏటా పదవతగరతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కంటిచూపును కాపాడుకోవాలి


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాలమన్

**కనగానపల్లి:** కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాలమన్ విద్యార్థులకు సూచించారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కింద స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులతో కలసి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కంటి చూపు కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

### అందని వైద్యం.. పాడి ఆవు మృతి

**పుట్టపర్తి:** బుక్కపట్నం మండలం సిద్దరాంపురంలో రైతు నాగ మోహన్‌రెడ్డి పాడి ఆవు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆవు నాలుగు రోజుల నుంచి అనారోగ్యంతో ఉందని, వైద్య సేవలు సరిగా అందకపోవడంతోనే మృతి చెందిందని ఆయన వాపోయారు. గూనిపల్లి పశు వైద్య సిబ్బంది వైద్యం సరిగా అందించలేదని ఆరోపించారు. గూనిపల్లి పశువైద్యాధికారి సూర్యనారాయణను వివరణ కోరగా తాను సిబ్బందితో కలిసి నాగమోహన్‌రెడ్డి పాడి ఆవుకు రెండు రోజులు వైద్యం అందించామని, ఆవు కడుపులో గడ్డ ఉందని మందులు వాడాలని సూచించామన్నారు.

### ఆదమరిస్తే అంతే..


కోతకు గురైన తగరకుంట-కళ్యాణదుర్గం దారి

**కనగానపల్లి:** భానుకోట సమీపంలో పుట్టకనుమ వద్ద ప్రధాన రహదారి భారీగా కోతలకు గురైంది. వాహనదారులు ఆదమరిచి రోడ్డు పక్కకు దిగారంటే వాహనాలు బోల్తాపడి పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. తగరకుంట-కళ్యాణదుర్గానికి వెళ్లే ఈ రహదారి గుండా ఆర్టీసీ బస్సులతో పాటు భారీ వాహనాలు వెళ్తుంటాయి. వర్షాకాలంలో రోడ్డు పక్కన మట్టి కొట్టుకుని పోవడంతో పెద్ద గుంతలు పడ్డాయి. దీనికి ఇది సింగల్ రోడ్డు కావడంతో రెండు వాహనాలు ఎదురుగా వెళ్లినప్పు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే కొంత మంది ప్రమాదాలకు గురయ్యారని భానుకోట, వేపకుంట, తగరకుంట గ్రామస్తులు తెలిపారు. ఈ రహదారి పక్కన వెంటనే మట్టి వేసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

### మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న న్యాయవాది లోకేశ్వరరెడ్డి

**కదిరి టౌన్:** మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తద్వారా తమ హక్కులను కాపాడుకోవచ్చని న్యాయవాది లింగాల లోకేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ ఎం.రాధిక అధ్యక్షతన మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా లింగాల లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమ కోసం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకుంటే వారిపై జరిగే అన్యాయలను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. ఆర్టీటీ ఆర్టీ శాంతమ్మ ఆర్టీటీ అందిస్తున్న సేవలను తెలియజేశారు. న్యాయవాది నరసింహులు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, ప్రభావతి, అలివేలమ్మ, మహిళలు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కార్యకర్తకు నివాళి

**ధర్మవరం:** పట్టణంలోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రం 4వ సెంటర్ అంగన్‌వాడీ టీచర్ అరుణమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం మృతురాలి స్వగ్రామం నల్లమాడలో జరిగిన అంత్యక్రియలకు ధర్మవరం అంగన్‌వాడీ సూపర్ వైజర్ లతాకిరణ్మయి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, సెక్టార్ లీడర్లు దీన, పోతక్క తదితరులు హాజరై అరుణమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అనిత, లక్ష్మీదేవి, గంగ, నాగమణి, సునిత, రత్నమ్మ, సుజాత, రాధ తదితరులు పాల్గొన్నారు.

### తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ఎన్పీకుంట:** తపాలా సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీపీఎం గిరి సూచించారు. స్థానిక తపాలా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తపాలా కార్యాలయాల్లో రూ.200 చెల్లించి వ్యక్తిగత ఖాతాలు ప్రారంభించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏబీపీఎం నాగార్జున పాల్గొన్నారు.

## ‘అపార్’ సమస్యలు పరిష్కరించాలి

**బత్తలపల్లి:** అపార్ నమోదుకు సంబంధించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జనన సర్టిఫికెట్లు పొందడానికి విచ్చేసిన తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా నాయకులు రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాల్యవంతం కుళ్లాయప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఉన్న తప్పిదాలను సరిదిద్దుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు చెప్పలేనివన్నారు. అపార్ నమోదులో ప్రామాణికంగా ఆధార్‌కు లింకైన బర్త్ సర్టిఫికెట్‌లో సవరణకు డబ్బులు ముట్టచెప్పనిదే పనులు జరగడం లేదని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు గుదిబండగా మారిన అపార్ కష్టాలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తల నాగభూషణ, పూజారప్ప, నారాయణ, కత్తి నారాయణ స్వామి, తాడిమర్రి మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దాసు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లి పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న సీపీఐ నేతలు

## కామాంధులను కఠినంగా శిక్షించాలి

**ధర్మవరం అర్బన్:** వైజాగ్‌లో న్యాయ విద్యార్థినిపై అత్యాచారం చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు సుమలత, బాల త్రిపుర సుందరి, భార్గవి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మీడియా, సినిమాల్లో అశ్లీలతను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు నరేంద్ర, నంద, విద్యార్థినులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు, విద్యార్థినులు

### ఏఐఎస్‌పీ జిల్లా మహాసభలు

**కదిరి అర్బన్:** పట్టణంలో శనివారం ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్(ఏఐఎస్‌పీ) జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సభలకు మహిళా కమిషన్ మాజీ మెంబర్ పర్విన్ భాను మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్‌పీ నాయకులు రాజీలేని పోరాటాలు చేస్తున్నారన్నారు. కదిరిలో మైనార్టీ గురుకుల పాఠశాలను వెంటనే ప్రారంభించాలన్నారు. కదిరిలో బీసీ బాలుర, బాలికల వసతిగృహాలకు పక్కాభవనాలు నిర్మించాలన్నారు. ఏఐఎస్‌పీ నాయకులు రాజేష్, ఉపాధ్యక్షుడు నరసింహ, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

### డైవర్షన్ రోడ్డులో ఇరుక్కున్న లారీ


**ఎన్పీకుంట:** ధనియానిచెరువు సమీపంలో డైవర్షన్ రోడ్డుపై శనివారం లారీ ఇరుక్కు పోవడంతో గంట పాటు రాకపోకలు స్తంభించాయి. కదిరి-రాయచోటి ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా ధనియానిచెరువు సమీపంలో మిట్ట మలుపు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం గుంత తవ్వి, రాకపోకల కోసం డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సమీపంలో ఉన్న కుంట నిండి నీరు ప్రవహిస్తుండటంతో డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. దీనితో ఓ వైపు ఇసుకచిత్తడి, మరో వైపు గుంత ఏర్పడటంతో ప్రతి రోజు ఏదో ఒక వాహనం గుంతలో ఇరుక్కు పోతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి

**పుట్టపర్తి అర్బన్:** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అడిషనల్ సీఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం ఆయన పుట్టపర్తి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకు ముందు ఆయనకు పుట్టపర్తికి రాగా ఆర్డీఓ సువర్ణ బొకే అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గోరంట్ల, బుక్కపట్నం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు నమోదు చేయించాలన్నారు. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినప్పుడు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు బీఎల్‌ఓలు ఉన్నారు.

**ఓటరుగా నమోదు చేసుకోండి**

**బత్తలపల్లి:** అర్హులైన వారందరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. శనివారం ఆమె మాల్యవంతం, సంజీవపురం గ్రామాల్లోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను భర్తీ చేసే విషయంలో ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపర్చాలని బీఎల్‌ఓలకు సూచించారు. అర్హులైనవారందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలోని బీఎల్‌ఓలు ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నట్లు వివరించారు.


ఎనుములపల్లి పోలింగ్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ సీఈఓ వెంకటేశ్వర్లు

## కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

**పుట్టపర్తి అర్బన్:** వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, టీడీపీ తాటాకు చప్పుళ్లకు బెదరమని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కంబాలపర్తి గ్రామానికి చెందిన కార్యకర్తలు చంద్రశేఖర్, గోపాల్, రత్నమ్మ, చిన్న వెంకటరాముడు, నాగేంద్ర, రాంబొజ్జిని అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపారు. వారు ఇటీవల బెయిల్‌పై రావడంతో శనివారం మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని వారిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం టీడీపీకి అడ్డుగా ఉన్న వారిపై కేసులు బనాయించి వేధిస్తోందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి సమస్యకూ సమాధానం చెప్తామన్నారు. తమ ఐదేళ్ల పాలనలో ఎన్నడూ ఇలాంటి పనులు చేయలేదన్నారు. ప్రభుత్వం శాశ్వతం కాదని, పచ్చని గ్రామాల్లో చిచ్చులు పెట్టరాదని హితవు పలికారు. వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పట్టణ కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి నాయకులు గంగాద్రి, తిప్పారెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.


బెయిల్‌పై వచ్చిన వారితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి**

**పుట్టపర్తి:** బుక్కపట్నం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్ట్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఆదినారాయణ(51) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం పంచాయితీరాజ్ ఇంజినీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు, రిటైర్డు డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు ఆదినారాయణ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్, జెట్పీటీసీ భర్త గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మి, మైనార్టీ సెల్ మండల కన్వీనర్ కదీర్,బుక్కపట్నం సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు పెనుజూరి మహేశ్, నీలూరి ఈశ్వర్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి టౌన్:** కర్ణాటకనాగేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి నూతన గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు శంకర్, చెన్నక్రిష్ణ, నరశింహులు, గంగాద్రి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు

### రావులచెరువులో జలహారతి


చెరువు మరువ వద్ద పూజలు చేస్తున్న మంత్రి సత్యకుమార్

**ధర్మవరం రూరల్:** రావులచెరువు గ్రామంలోని చెరువు మరువ వద్ద శనివారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్యకుమార్ గంగ పూజ చేసి జలహారతినిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చెరువు నిండడంతో ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. ధర్మవరం చెరువు నిండడంతో చివరి మరువ ద్వారా వచ్చే నీటితో రావులచెరువు చెరువును నింపామన్నారు. మేటా హంద్రీనీవా నీటితో చెరువులను నింపే ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్డీఓ మహేష్, ఇంచార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీఓ సాయి మనోహర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన నేత మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాలుడి అప్పగింత


రామగిరిలో తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**రామగిరి:** మండల కేంద్రంలో శనివారం మతిస్థిమితంతో దుకాణాల వద్ద తిరుగుతున్న ఓ బాలుడిని గుర్తించిన.. పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ తెలిపిన వివరాలు.. పరిగి మండలం కోనాపురం గ్రామానికి చెందిన అంజినప్ప, సుగుణ దంపతులకు ఏడేళ్ల వయసున్న కుమారుడు పవన్ ఉన్నాడు. పవన్ మానసిక పరిస్థితి సరిగా లేక పోవడంతో శనివారం ఉదయం పరిగిలో బస్సు ఎక్కి పావగడ చేరుకున్నాడు. అక్కడి నుంచి రామగిరికి వచ్చాడు. దుకాణాల వద్ద తిరుగుతుండటంతో గమనించిన పోలీసులు బాలుడి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులను పిలిపించి, బాలుడిని అప్పగించారు.

### చెవిటివారిపల్లిలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాం


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి డాక్టర్ నివేదిత

**నల్లచెరువు:** చెవిటివారిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీసత్యసాయి జిల్లా స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నివేదిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం నుంచి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. బరువు, ఎదుగుదల లోపం, చెవుడు, మూగ, వెన్నెముక సమస్యలున్న విద్యార్థులను గుర్తించి డిసెంబర్ 1న ప్రత్యేక వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తామన్నారు. సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, ఏఎన్‌ఎంలు సరస్వతి, శ్రావణి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసరెడ్డి, నారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

**తాడిమర్రి:** పెద్దకోట్ల గ్రామంలో ఆదివారం చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. కార్తీక మాసం చివరి ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఎంపీపీ, ఆలయ ధర్మకర్త పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, పాటిల్ కపిల్‌నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు ప్రత్యేక పూజల అనంతరం నరసింహస్వామి జ్యోతుల సమర్పణ, అమ్మవారి ఉత్సవ విగ్రహం జలధి, రాత్రి 12 గంటలకు కాలవర్తమానం చెప్పే కార్యక్రమం ఉంటుంది. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగిస్తారు. సోమవారం ఉదయం తలపై జ్యోతులు ఎత్తుకున్న భక్తులు నాట్యం చేస్తారు. అనంతరం గ్రామస్తులు బోనాలను సమర్పిస్తారు.

**నేడు జ్యోతుల మహోత్సవం**

**బత్తలపల్లి:** మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలోని పెద్దకోట్ల పెద్దమ్మకు ఆదివారం రాత్రి జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గుడికట్లు శనివారం తెలిపారు.చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కారణంగా తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామానికి చెందిన వందలాది కుటుంబాలు బత్తలపల్లికి వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వడ్డెర కాలనీలో పెద్దమ్మ, సుంకులమ్మ ఆలయాలను అధునాతనంగా నిర్మించుకుని ఏటా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు.